క్లుప్తంగా

'మానవత'కు రూ.2.50 లక్షల విరాళం


మానవత సంస్థకు విరాళం అందజేస్తున్న డైరెక్టర్ పాతూరి సత్యనారాయణ

నల్లజర్ల: మానవత సంస్థకు ఆ సంస్థ డైరెక్టర్ పాతూరి సత్యనారాయణ మంగళవారం రూ.2.50 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు మానవత సంస్థ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపింది. కార్యక్రమంలో జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు వెంకట సూర్యనారాయణ, మండల చైర్మన్ భోగవల్లి వెంకట సుబ్బారావు, మండల శాఖ అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు, గుళ్ళపూడి వెంకటరత్నం, గుత్తికొండ వర ప్రసాద్, ఉప్పాడ కామేశ్వరరావు, నందం రాజేంద్రప్రసాద్, దావులూరి చిరంజీవి, అల్లాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేర్పించండి

ఉండ్రాజవరం: టెన్త్ పాసైన పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేర్పించాలని సత్యవాడ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.సూర్యకాంతం కోరారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ఈ హైస్కూల్ ప్లస్‌గా జూనియర్ కాలేజీ (కో-ఎడ్యుకేషన్)గా మారిందని ఆమె తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులను తమ కళాశాలలో చేర్పించాలని కోరుతూ మంగళవారం హెచ్ఎం, ఉపాధ్యాయులు సత్యవాడ, చిలకపాడు తదితర గ్రామాల్లో పర్యటించి, తల్లిదండ్రులను కలుస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం బి.సూర్యకాంతం మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, సీఈసీ రెండు గ్రూపులు ఉన్నాయన్నారు. పూర్తి స్థాయిలో అధ్యాపకులు, తరగతి గదులు వంటి వసతులన్నీ ఉన్నాయన్నారు.

నిఘా వైఫల్యం వల్లే హింసాత్మక ఘటనలు

గోపాలపురం: ఎన్నికల అనంతరం రాష్ట్రంలో జరిగిన హింసాత్మక ఘటనలకు నిఘా వర్గాల వైఫల్యమే కారణమని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొంతా శ్యామ్ రవిప్రకాష్ అన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల అనంతరం జరిగిన అధికారుల బదిలీలు వివక్ష పూరితంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఎక్కడ అవాంఛనీయ ఘటనలు జరిగినా వాటికి ఎస్సీ, ఎస్టీ అధికారులే బలవుతున్నారన్నారు. మార్చిలో ఎన్నికల కమిషన్ బదిలీ చేసిన నలుగురు అధికారుల్లో ముగ్గురు ఎస్సీలే అని ఆయన గుర్తు చేశారు. పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్‌ను మార్చడానికి గల కారణాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. శాంతి భద్రతలు ఎన్నికల కమిషన్ చేతిలో ఉంటాయని అలాంటి సందర్భంలో కలెక్టర్లను ఎందుకు బలి చేయాల్సి వస్తుందో చెప్పాలని శ్యామ్ రవిప్రకాష్ కోరారు. తిరిగి పల్నాడు జిల్లా కలెక్టర్‌గా శివశంకర్‌ను నియమించాలని ఆయన ఈసీని కోరారు.

వైఎస్సార్ సీపీకి తీరని లోటు

చాగల్లు: మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటని జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ, ఆమె భర్త శ్రీనివాస్ అన్నారు. చాగల్లులో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఐదుసార్లు కొవ్వూరు ఎమ్మెల్యేగా సేవలు అందించి, అన్ని వర్గాల ప్రజల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న నేత కృష్ణబాబు మృతి చెందడం బాధాకరం అన్నారు. 2012 నుంచి వైఎస్సార్ సీపీ అభివృద్ధిలో, పార్టీ గెలుపులో కృష్ణబాబు కృషి ఎంతో ఉందన్నారు. ఈ నియోజకవర్గానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కృష్ణబాబు మృతికి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మండలంలోని వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీజేపీ నాయకులు ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఊనగట్ల సొసైటీ అధ్యక్షుడు అత్యూరి దొరయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, పార్టీ మండల శాఖ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, జుట్టా కొండలరావు, టీడీపీ నాయకులు కొఠారు అశోక్‌బాబా, ఆళ్ల హరిబాబు తదితరులు కృష్ణబాబుతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

రాజకీయ ఉద్దండుడు కృష్ణబాబు

- హైదరాబాద్‌లో కన్నుమూత
- కొవ్వూరుపై ఆయనది చెరగని ముద్ర
- ఉమ్మడి పశ్చిమ రాజకీయాల్లో కీలక స్థానం
- ఎందరికో రాజకీయ మార్గ దర్శకుడు


నిడదవోలులో మున్సిపల్ పార్కును ప్రారంభిస్తున్న నాటి ముఖ్యమంత్రి దివంగత మహానేత వైఎస్సార్. పక్కనే కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు (ఫైల్)


వైఎస్సార్ సీపీ గౌరవాధ్యక్షురాలు వైఎస్ విజయలక్ష్మి సమక్షంలో 2012లో ఆ పార్టీలో చేరుతున్న మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు (ఫైల్)


ఓదార్పు యాత్ర వేళ మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శ (ఫైల్)

కొవ్వూరు: హైదరాబాద్‌లో మంగళవారం ఉదయం కన్నుమూసిన పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) కొవ్వూరు నియోజకవర్గంపై చెరగని ముద్ర వేశారు. ఆయన ఇక్కడి నుంచి అత్యధికంగా ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై రికార్డు సృష్టించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయాల్లో తన కంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు (2009కు పూర్వం) కొవ్వూరు, నిడదవోలు పురపాలక సంఘాలు, నిడదవోలు మండలం కొవ్వూరు నియోజకవర్గం పరిధిలో ఉండేవి. దీంతో నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం, పోలవరం, తణుకు నియోజకవర్గాల పరిధిలో ఆయన తనదైన రాజకీయం నడిపేవారు. నిడదవోలు మండలం శెట్టిపేట విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం ఆయన హయాంలో ఏర్పడింది. గోదావరిపై ఎత్తిపోతల పథకాలకు ఆయన హయాంలో అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. పైడిమెట్ట, తాడిపూడి జంట ఎత్తిపోతల పథకాలను కృష్ణబాబు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. ఆరికిరేవుల ఎత్తిపోతల పథకం కృష్ణబాబు హయాంలోనే ప్రారంభించారు. గోదావరి పుష్కరాల సమయంలో కొవ్వూరులో చేపట్టిన పలు అభివృద్ధి పనులు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి.

ఎంతో మందికి రాజకీయ భవిష్యత్తు

కృష్ణబాబు నాయకత్వంలో అప్పట్లో పనిచేసిన ఎంతో మంది యువకులు నేడు నియోజకవర్గ స్థాయి నాయకులుగా ఎదిగారు. ఎంతో మందికి రాజకీయ భవిష్యత్తు అందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంతో మందికి అవకాశాలు కల్పించి తన నాయకత్వ పటిమను నిరూపించుకున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఇమ్మణ్ని రాజేశ్వరి, గోపాలపురం, పోలవరం, కొవ్వూరు ఎమ్మెల్యేలుగా జొన్నకూటి బాబాజీరావు, పూనెం సింగన్నదొర, టీవీ రామారావు వంటి వారికి ఎమ్మెల్యే లుగా ఛాన్స్ ఇప్పించి తన మార్కు రాజకీయం చేశారు. ప్రస్తుత హోం మంత్రి తానేటి వనితకు గోపాలపురం నుంచి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించడంలోను కృష్ణబాబు పాత్ర కీలకమైనది. తన అల్లుడు ఎస్.రాజీవ్‌కృష్ణకు నిడదవోలు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశంతో పాటు రాజకీయంగా ఈ ప్రాంతంలో నిలదొక్కుకునేందుకు కృష్ణబాబు బాటలు వేశారు. దీంతో వైఎస్సార్ సీపీలో రాష్ట్ర స్థాయి నేతగా రాజీవ్ కృష్ణ కొనసాగుతున్నారు.

నిడదవోలుతో అనుబంధం

నిడదవోలు: కొవ్వూరు ఎమ్మెల్యేగా కృష్ణబాబు పని చేసిన ఐదు పర్యాయాలూ నిడదవోలు పట్టణం, నిడదవోలు మండలం ఆ నియోజకవర్గంలో అంతర్భాగమే. దాంతో ఆయనకు ఈ ప్రాంతంతోను, ఇక్కడి నాయకులతోను విడదీయరాని అనుబంధం ఉంది. శాసన సభ్యుడిగా కృష్ణబాబు నిడదవోలు పట్టణంలోను, మండలంలోను పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ప్రాంత అభివృద్ధిలో ఇప్పటికీ ఆయన ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. పార్టీలకు అతీతంగా నిడదవోలు పట్టణాభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివి. ప్రధానంగా వ్యవసాయ రంగంపై ఆయన దృష్టి పెట్టేవారు. కాలువల ఆధునీకరణ పనులు చేయించారు. ప్రతి పంటకూ పుష్కలంగా సాగు నీరు అందించేలా ఆయన ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకునే వారు. పట్టణంలో ప్రస్తుతం ఉన్న పాత ఆర్వోబీ కృష్ణబాబు హయాంలోనే నిర్మించారు. నిడదవోలులో ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్వీడీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలు ఆయన హయాంలోనే నిర్మించారు. 2014 ఎన్నికల్లో నిడదవోలు వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎస్.రాజీవ్‌కృష్ణకు మద్దతుగా కృష్ణబాబు ఎన్నికల ప్రచారం చేశారు. అలాగే మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కూడా ఆయన పాల్గొన్నారు.

రాజీవ్ నగరబాట కార్యక్రమంలో భాగంగా దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి హోదాలో 2005లో నిడదవోలు పట్టణంలో పర్యటించారు. ఆ సమయంలో పట్టణంలో కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వైఎస్ ప్రారంభించారు. కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే జీఎస్ రావుతో పాటు ఎమ్మెల్యేగా కృష్ణబాబు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబుల మధ్య మంచి అనుబంధం ఉండేది. రాజీవ్ నగర బాటలో సమయంలో వైఎస్సార్ కృష్ణబాబును 'కృష్ణా' అంటూ ఆప్యాయంగా పిలిచి బస్సు ఎక్కించుకున్న ఘటనను టీడీపీ, కాంగ్రెస్ నాయకులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు.


మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు కుమార్తె అర్చన, రాజీవ్ కృష్ణ వివాహ విందులో మాజీ సీఎం వైఎస్


మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబుతో చాగల్లు మండల నాయకులు (ఫైల్)



వైఎస్సార్ సీపీ నిడదవోలు నియోజకవర్గ ప్లీనరీలో మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు (ఫైల్)

తాళ్లపూడి మండలం..

తాళ్లపూడి: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు పెండ్యాల కృష్ణబాబు మృతికి ఆ పార్టీకి చెందిన పలువురు సంతాపం తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ తోట రామకృష్ణ, నాయకులు గోకవరపు మాణిక్యాలరావు, నక్కా చిట్టిబాబు, కొమ్మిరెడ్డి పరశురామరావు, నామా శ్రీనివాస్, కుంటముక్కల కేశవనారాయణ, వల్లభని శ్రీహరి, యాళ్ల బాబురావు, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, జనసేన పార్టీ మండలశాఖ అధ్యక్షుడు గంటా కృష్ణ, నామా శ్రీరాములు తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగితీగ చోరీ ముఠా అరెస్ట్

- రూ. 6 లక్షల విలువైన 600 కిలోల రాగి వైరు స్వాధీనం
- నలుగురు నిందితుల అరెస్ట్
- మూడు జిల్లాల్లో చోరీలు
- కొవ్వూరు డీఎస్పీ రామారావు వెల్లడి


స్వాధీనం చేసుకున్న రాగి దిమ్మెలతో పోలీసులు

దేవరపల్లి: మూడు జిల్లాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగితీగ చోరీకి పాల్పడుతున్న ముఠాను కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు సారథ్యంలో దేవరపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా నుంచి 225 రాగి దిమ్మెలు, 100 కిలోల రాగితీగ (మొత్తం 600 కిలోలు)ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.6 లక్షలని కొవ్వూరు డీఎస్పీ రామారావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఏలూరు రేంజ్ పరిధిలోని తూర్పు, పశ్చిమ, కాకినాడ జిల్లాల పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను నలుగురు సభ్యులు గల ముఠా బద్దలు కొట్టి దానిలోని రాగి దిమ్మలు, రాగివైరును దొంగిలించి పాత ఇనుము కొనుగోలుదారులకు విక్రయిస్తోంది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా, పి.గన్నవరం మండలం, గంటి పెదపూడిలోని రాజీవ్ కాలనీకి చెందిన సుంకర సతీష్ (శివ), కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరంలోని రంగవల్లి నగర్‌కు చెందిన కొమ్మిరెడ్డి దుర్గ, రంగవల్లి నగర్‌కే చెందిన నెల్లూరి లోవరాజు, అదే మండలంలోని ఉప్పర రామవరానికి చెందిన నక్కా నాగేంద్ర కుమార్ (పొట్టి) ఓ ముఠాగా ఏర్పడి ఈ తరహా చోరీలకు పాల్పడుతున్నారు.

దొంగతనాల వివరాలు

కాకినాడ జిల్లా పెద్దాపురంలో 17, సామర్లకోటలో 5, ఏలేశ్వరంలో 2, అన్నవరంలో 3, మొత్తం 17 ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి పాల్పడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం రూరల్‌లో 42 ట్రాన్స్‌ఫార్మర్లు, తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో 7, గోపాలపురంలో 2, నల్లజర్లలో 10, కొవ్వూరు టౌన్‌లో 2, చాగల్లులో 2, సమిశ్రగూడెంలో 2, రంగంపేటలో 16, బిక్కవోలులో 10, మొత్తం 51 ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేశారు.

స్వాధీన పరుచుకున్న సొత్తు వివరాలు

226 కాపర్ దిమ్మెలు (ఒక్కొక్క దిమ్మ 1.5 నుంచి 2 కిలోలు), కాపర్ వైరు 100 కిలోలు మొత్తం 600 కిలోలు. చోరీ సొత్తు విలువ సుమారు రూ.6 లక్షలని డీఎస్పీ రామారావు తెలిపారు. నిందితులు సుంకర సతీష్ తన గ్రామం గంటి పెదపూడిలో పాత ఇనుము వ్యాపారం చేస్తుండగా, కొమ్మిరెడ్డి దుర్గ, నెల్లూరి లోవరాజు ఒకే గ్రామానికి చెందిన వారు. వారిద్దరూ ఇంటింటికీ తిరిగి ఉల్లిపాయలను పాత ఇనుముకు, సొమ్ముకు విక్రయిస్తుంటారు. పాత ఇనుము కూడా కొనుగోలు చేసి సుంకర సతీష్‌కు అమ్మేవారు. ఈ నేపథ్యంలో నలుగురూ ముఠాగా ఏర్పడి సతీష్‌కు చెందిన మినీ వ్యాన్‌ను, నక్కా నాగేంద్రకు చెందిన గ్లామర్ బైక్‌పై సుమారు ఏడాదిన్నరగా రాత్రి వేళ పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను బద్దలు కొట్టి, రాగివైరును వేరు చేసి గుర్తు తెలియని వ్యక్తులకు అమ్ముతున్నారు. ఈ క్రమంలో సుంకర సతీష్ తన వ్యాపాన్ని విస్తరించి కొంత కాలం క్రితం తాడేపల్లిగూడెం డంపింగ్ యార్డు వద్ద దుకాణం ఏర్పాటు చేశారు. ఆ ముఠా సభ్యులు దొంగిలించిన రాగి వైరును కరిగించి దిమ్మెలుగా తయారు చేశాడు. అలాంటి 225 దిమ్మలను ఆరు మూటల్లో ఉంచి వ్యాన్‌లో అమ్మడానికి విజయవాడ తీసుకు వెళుతుండగా దేవరపల్లి ఎస్సై కె. శ్రీహరిరావు, సిబ్బంది వి.చంద్రశేఖర్ (హెచ్‌సీ), వి.చక్రవర్తి , ఎస్‌కే సలీం, వి. రాంగోపాల్ , రామారావు రాజమహేంద్రవరం సీసీఎస్ ఎస్సై కె.రజని, సిబ్బంది కలిసి దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద పట్టుకున్నట్టు డీఎస్పీ రామారావు వివరించారు. దేవరపల్లి సీఐ పి. బాలసురేష్ బాబు, రాజమహేంద్రవరం సీసీఎస్ ఎస్సై కె.రజనీ కుమార్, ఆధ్వర్యంలో దేవరపల్లి ఎస్సై శ్రీహరిరావు కేసు నమోదు చేసి, నిందితులను అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహాలక్ష్మమ్మ అమ్మవారికి పూజలు


చాగల్లులో మహాలక్ష్మమ్మ వారికి పూజలు చేస్తున్న దృశ్యం

చాగల్లు: స్థానిక అమ్మవారు మహాలక్ష్మమ్మ వార్షిక పూజా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. వేద పండితుడు సుబ్రహ్మణ్యం ,పండిత పురోహితుల వేద మంత్రాలతో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 22న అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్టు అలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. చాగల్లు వారిచే భజన కాలక్షేపం జరిగింది. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లైబ్రరీలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు


శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

నిడదవోలు: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహించారు. వారితో నీతి కథలు, ఇంగ్లిష్ స్టోరీలు, వేమన పద్యాలు, వార్తా పత్రికలను చదివించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఉపాధ్యాయులు సూచించడంతో గ్రంథాలయంలో అందుబాటులో పాఠ్యా పుస్తకాలను చదువుతూ తమ విజ్ఞానాన్ని మరింతగా మెరుగు పరుచుకుంటున్నారు. గ్రంథాలయాధికారి కుంచే చినబాబు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: వేసవి విజ్ఞాన శిబిరం స్థానిక శాఖా గ్రంథాలయంలో కొనసాగుతోంది. గ్రంథాలయాధికారి ఎ.నరేష్ విద్యార్థులతో వివిధ రకాల పుస్తకాలు చదివించారు. కార్యక్రమంలో గుండుబోగుల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి కల్యాణం వేళ భక్తుల రద్దీ

- అన్నవరప్పాడు స్వామివారిని దర్శించుకున్న వేలాది భక్తులు
- ఆలయం వద్ద విస్తృతంగా ఏర్పాట్లు


అన్నవరప్పాడు వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కుంకుమార్చన


స్వామివారి ఆలయంలో సదస్యం నిర్వహిస్తున్న వేద పండితులు


వేంకటేశ్వర స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

పెరవలి: అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు మూడో రోజైన మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము 4 గంటల నుంచే అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి రాసాగారు. ఉదయం ఆరు గంటల తర్వాత భక్తుల క్యూలైన్ జాతీయ రహదారి వరకూ చేరింది. స్వామివారి దర్శనానికి గంట సమయం పట్టింది. ఆలయానికి వచ్చిన వేలాది భక్తులకు అసౌకర్యం కలగకుండా వైఎస్సార్ సీపీ నాయకుడు పంతం చిన్న యూత్ ఆధ్వర్యంలో జాగ్రత్తలు తీసుకున్నారు. పిల్లలకు పాలు, దాతల సహకారంతో ఉచిత ప్రసాదంగా సత్యనారాయణ స్వామివారి ప్రసాదం, బూందీ పంపిణీ చేశారు. వందలాది భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలోని దుకాణ సముదాయాలు భక్తులతో కళకళలాడాయి. ఉదయం, సాయంత్రం కలిపి సుమారు ఐదు వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. కాగా వేంకటేశ్వరస్వామివారి సన్నిధిలో నిర్వహించిన కుంకుమార్చనలో 108 మహిళలు పాల్గొన్నారు.

అలరించిన సదస్యం

మంగళవారం మధ్యాహ్నం ఆలయం వద్ద కృష్ణ యజుర్వేదం, శుక్ల యజుర్వేదం, ఋగ్వేదం, సామ వేదం, అథర్వణ వేదంలో నిష్ణాతులైన 10 మంది వేద పండితులచే సదస్యం నిర్వహించారు. ఆద్యంతం ఈ కార్యక్రమం సందడిగా సాగింది. మంగళవారం నాటి స్వామి వారి కల్యాణాన్ని బొలిశెట్టి చిన చంద్రరాజు కుటుంబ సభ్యులు నిర్వహించారు.

రోటరీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: రోటరీ క్లబ్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ చెల్లూరి వీర నాగ ప్రసాద్ ఆర్థిక సహకారంతో మంగళవారం పట్టణంలోని ఆడిటోరియంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. వివిధ విభాగాల్లో వైద్యులు 179 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. 36 మందికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, వైద్యులు కన్నాజి సిద్ధార్థ, ఎం.రాఘవేంద్ర, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, యాసరపు రామకృష్ణ, గుంటుపల్లి శివకుమార్, పొన్నా సుబ్రహ్మణ్యశర్మ , గోపిరెడ్డి శ్రీనివాస్, కాళ్ల రాంబాబు, కొత్తపల్లి నాగేశ్వరరావు, చిక్కాల రాజా, గొన్నాబత్తుల రామారావు రొటేరియన్లు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకం



ఉండ్రాజవరం: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారికి మంగళవారం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. అనంతరం స్వామి వారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈసందర్భంగా స్వామి వారిని భక్తులు దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా మదన గోపాలుని కల్యాణం


కల్యాణోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, వేదపండితులు

నల్లజర్ల: అనంతపల్లిలోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి వారి వార్షిక కల్యాణోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ కానుబోయిన గంగాధరరావు, ఈఓ లక్ష్మీశరణ్యాలు పూజాదికాలు నిర్వహించి స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు. వేద పండితుడు పెదపూడి విజయకృష్ణమాచార్యులు, ఆలయ అర్చకుడు దివి పాండురంగ శర్మ ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. మంగళవారం ఉదయం స్వామికి నిత్యపూజ, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. నిత్యహోమం, బలిహరణ జరిగాయి. ఈనెల 19న ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 22న రథోత్సవం, శుక్రవారం రాత్రి పవళింపు సేవ జరుగుతాయి.